క్లుప్తంగా

రాష్ట్ర స్థాయి పోటీల్లో సెయింటాన్స్ విద్యార్థుల ప్రతిభ



క్రోసూరు: ఈ నెల 17, 18, 19 తేదీల్లో శ్రీకాకుళం జిల్లాలో జరిగిన రాష్ట్ర స్థాయి సాఫ్ట్ బాల్ టోర్నమెంట్‌లో క్రోసూరు సెయింటాన్స్ ఇంగ్లిష్ మీడియం పాఠశాల విద్యార్థులు కె.దీవెన ఏంజల్, కె.పూజిత, జి.తనూజ ఉమ్మడి గుంటూరు జిల్లా నుంచి ద్వితీయ స్థానం సాధించినట్లు పాఠశాల ప్రిన్సిపాల్ మేరీ రజిత బుధవారం తెలియజేశారు. జిల్లా జట్టు ద్వితీయ స్థానంలో నిలిచి, సిల్వర్ మెడల్, ట్రోఫీని సాధించుకున్నట్లు చెప్పారు. ఈ సందర్భంగా క్రీడాకారులను అభినందిస్తూ క్రీడలలో పాఠశాల తరఫున జాతీయస్థాయి పోటీల్లో విజయం సాధించాలని ఆకాంక్షిస్తున్నట్లు తెలిపారు.

700 పశువులకు గాలికుంటు టీకాలు



క్రోసూరు: మండల కేంద్రమైన క్రోసూరు, పీసపాడు గ్రామాల్లో బుధవారం 700 పశువులకు గాలికుంటు వ్యాధి నిరోధక టీకాలు వేసినట్లు మండల పశు వైద్యులు డాక్టర్ మల్లయ్య తెలిపారు. అన్ని గ్రామాల్లో పశువులకు గాలికుంటు వ్యాధి టీకాలు వేస్తున్నట్లు తెలిపారు. గ్రామాల్లో ముందుగా దండోరా వేయించి టీకాలు వేస్తున్నామని, పశు పోషకులు తప్పనిసరిగా తమ పశువులకు టీకాలు వేయించాలని కోరారు.

ముప్పాళ్ల జెడ్పీ పాఠశాలలో స్పెషల్ డ్రైవ్



ముప్పాళ్ల: మండల కేంద్రమైన ముప్పాళ్ల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఆంధ్రప్రదేశ్ సార్వత్రిక విద్యాపీఠం ఆధ్వర్యంలో స్పెషల్ ఎన్‌రోల్‌మెంట్ డ్రైవ్ బుధవారం నిర్వహించారు. కార్యక్రమంలో స్టేట్ కోఆర్డినేటర్ ఎస్.అక్బర్‌అలీ, జిల్లా సమన్వయకర్త కేఎం హుస్సేన్‌లు పాల్గొని బడి మానేసి, 16 సంవత్సరాలు నిండిన వారిని గుర్తించి మరలా చదువుకునేలా అవగాహన కల్పించాలని సూచించారు. దూరవిద్య ద్వారా పదవతరగతి, ఇంటర్ పూర్తి చేసుకునే అవకాశం ఉందని, ఈ విధానం వలన కలిగే ప్రయోజనాలను వివరించాలన్నారు. మధ్యలో చదువు మానేసిన వారికి మంచి అవకాశం దూరవిద్య ద్వారా ప్రభుత్వం కల్పించిందన్నారు. ఈ నెలాఖరులోపు అడ్మిషన్ల ప్రక్రియ పూర్తి చేయాలన్నారు. కార్యక్రమంలో భాగంగా దూరవిద్య కోర్సులకు సంబంధించిన వాల్‌పోస్టర్‌ను ఆవిష్కరించారు. పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు కుంభా నాగేంద్రమ్మ, ప్రోగ్రామ్ అసిస్టెంట్ డీసీ చినరామయ్య, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

జెడ్పీ పాఠశాలకు క్రికెట్ కిట్లు అందజేత



పెదకూరపాడు: గ్రామీణ ప్రాంతాల్లో క్రీడలను ప్రోత్సహించాలని మాగులూరి ఫౌండేషన్ నిర్వాహకులు మాగులూరి కృష్ణారావు అన్నారు. బుధవారం పెదకూరపాడులోని జెడ్పీ పాఠశాలకు ఎన్ఆర్ఐ, మాగులూరి ఫౌండేషన్ వ్యవస్థాపకులు మాగులూరి భానుప్రకాష్ కుమారులు మాగులూరి అర్జున్, సిద్ధార్థల చేతుల మీదుగా క్రికెట్ కిట్లు అందించారు. ఈ సందర్భంగా ప్రధానోపాధ్యాయులు రమణ మాట్లాడుతూ దాతలు ప్రభుత్వ పాఠశాలల్లోని విద్యార్థులలో దాగి ఉన్న ప్రతిభను వెలికి తీసేందుకు క్రీడా సామగ్రిని ఇవ్వాలని కోరారు. మాగులూరి ఫౌండేషన్ ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు నగదు, ల్యాప్‌టాప్‌లు, పుస్తకాలు, ఆట వస్తువులు ఇచ్చి ఎంతో ప్రోత్సహిస్తుందన్నారు. వ్యవస్థాపకులు మాగులూరి భానుప్రకాష్ సేవలను కొనియాడారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

మాజీ పట్టణ ప్రధాన కార్యదర్శి నాగేశ్వరరావు మృతి

సత్తెనపల్లి: వైఎస్సార్‌సీపీ మాజీ పట్టణ ప్రధాన కార్యదర్శి చల్లా నాగేశ్వరరావు (59) అనారోగ్యంతో బుధవారం మృతి చెందారు. ఆయన గత కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతూ చికిత్స పొందుతున్నారు. పట్టణంలోని ప్రైవేట్ వైద్యశాలలో చికిత్స పొందుతూ మృతి చెందగా మృతదేహాన్ని పట్టణంలోని ఒకటో వార్డులోని నివాసానికి తరలించారు. మృతుడికి భార్య, ఇరువురు కుమార్తెలు, ఓ కుమారుడు ఉన్నారు. మృతదేహాన్ని పట్టణ పార్టీ నాయకులు సందర్శించి కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలిపారు. వారిలో వ్యవసాయ మార్కెట్ కమిటీ మాజీ వైస్ చైర్మన్ గార్లపాటి ప్రభాకర్, పార్టీ నాయకులు తదితరులు ఉన్నారు.

పట్టని ప్రజారోగ్యం..

కానరాని పారిశుద్ధ్యం

ప్రతికూల వాతావరణ పరిస్థితులు, పారిశుద్ధ్య లేమితో విష జ్వరాలు విజృంభిస్తున్నాయి. ఎక్కడ చూసినా టైఫాయిడ్, మలేరియా, డెంగీ, డయేరియా ప్రబలుతున్నాయి. గడచిన 20 రోజులలో సత్తెనపల్లి డివిజన్ పరిధిలోని సత్తెనపల్లి, పెదకూరపాడు నియోజకవర్గాల్లోని ప్రభుత్వ ఆసుపత్రుల్లో వందల సంఖ్యలో జ్వరాల కేసులు నమోదు కాగా.. ప్రైవేట్ ఆస్పత్రులు, పీఎంపీలను ఆశ్రయిస్తున్న రోగుల సంఖ్య లెక్కేలేదు. విష జ్వరాలు డివిజన్‌ను వణికిస్తుండగా డివిజన్ యంత్రాంగం చర్యలు తీసుకున్న దాఖలాలు లేవు.

- ప్రతికూల వాతావరణంతో విజృంభిస్తున్న విష జ్వరాలు
- పారిశుద్ధ్య నిర్వహణ, దోమల నిర్మూలనకు లేని చర్యలు
- రోగులతో కిటకిటలాడుతున్న ప్రభుత్వ, ప్రైవేట్ ఆస్పత్రులు



ఏరియా వైద్యశాలలో చికిత్స పొందుతున్న జ్వర పీడితులు

సత్తెనపల్లి: కొద్ది రోజుల క్రితం వరకు ముసురు పట్టి వర్షాలు కురవగా మళ్లీ కొద్ది రోజులుగా వేసవిని తలపిస్తున్న ఎండలు ప్రజలను ఉక్కిరిబిక్కిరి చేస్తున్నాయి. గ్రామీణ ప్రాంతాల్లో వర్షపు నీరు చేరి మురుగు గుంతలుగా మారాయి. చెత్త తరలింపు సక్రమంగా జరగక చాలా గ్రామాలు పారిశుద్ధ్య లేమితో కొట్టుమిట్టాడుతున్నాయి. డ్రైన్లు దుర్గంధాన్ని వెదజల్లుతున్నాయి. అక్కడక్కడ పైపులైన్ల లీకేజీ సమస్యలతో రక్షిత మంచి నీరు కలుషితం అవుతుంది. ప్రతికూల వాతావరణ పరిస్థితులకు తోడు నియంత్రణ చర్యలు కొరవడటం విష జ్వరాల వ్యాప్తికి కారణమవుతుంది. సత్తెనపల్లి, పెదకూరపాడు నియోజకవర్గాల్లోని సత్తెనపల్లి పట్టణం, సత్తెనపల్లి రూరల్, ముప్పాళ్ల, రాజుపాలెం, నకరికల్లు, పెదకూరపాడు, అచ్చంపేట, అమరావతి, క్రోసూరు, బెల్లంకొండ మండలాల్లో పట్టణం, పల్లెలు తేడా లేకుండా ఎక్కడ చూసినా జ్వర పీడితులే కనిపిస్తున్నారు. చలి జ్వరం, జలుబు, దగ్గు, తలనొప్పి తదితర లక్షణాలతో రోజుల తరబడి మంచం పడుతున్నారు.

- ప్రభుత్వ, ప్రైవేటు ఆసుపత్రులు వైరల్ ఫీవర్ రోగులతో కిటకిటలాడుతున్నాయి. గడచిన 20 రోజుల్లో సత్తెనపల్లి ఏరియా ప్రభుత్వ వైద్యశాలలో సుమారు 11,500 ఓపీ కాగా వీరిలో ఐదేళ్ల లోపు



ఏరియా వైద్యశాలలో ల్యాబ్ వద్ద క్యూలో రోగులు

చిన్నారులు 100 మంది, పెద్దవాళ్లు 680 మంది జ్వర పీడితులే ఉన్నారు. డయేరియాతో చిన్నారులు 21 మంది, పెద్దవాళ్లు 94 మంది ఓపీ, ఐపీలో ఉన్నారు. జ్వరాలతో ప్రైవేట్ ఆస్పత్రులు, గ్రామీణ వైద్యులను ఆశ్రయిస్తున్న వారి సంఖ్య చాలా ఎక్కువగా ఉంటుంది. వివిధ రకాల టెస్టులు, వైద్యం పేరుతో రోగుల నుంచి రూ.25 వేల నుంచి రూ.50 వేల వరకు బిల్లులు వసూలు చేస్తూ ప్రైవేట్ ఆసుపత్రి యాజమాన్యాలు చుక్కలు చూపిస్తున్నాయి.

మూడు రోజుల నుంచి జ్వరం



రెక్కాడితేగాని డొక్కాడని కుటుంబం నాది. జ్వరాలతో ఇబ్బందులు తప్పడం లేదు. నేను మూడు రోజులుగా జ్వరంతో బాధపడుతున్నా. రక్త పరీక్షలు చేశారు. డెంగీగా నిర్ధారించారు. పట్టణంలోని ఏరియా వైద్యశాలలోనే చికిత్స పొందుతున్నా. జ్వరాల తీవ్రత ఎక్కువగా ఉంది.

–గాదం వెంకాయమ్మ, మహిళ, బ్రాహ్మణపల్లి

జ్వరంతో ఇబ్బందులు



జ్వరంతో ఎన్నో ఇబ్బందులు పడుతున్నా. అసలే వృద్ధురాలిని. ఏదో నా పనులు నేను చేసుకుంటూ జీవనం వెళ్లదీస్తూ ఉంటాను. మూడు రోజులుగా జ్వరం వచ్చి మంచం పట్టా. జ్వరం తగ్గకపోవడంతో సత్తెనపల్లి ఏరియా వైద్యశాలలో చేరి చికిత్స పొందుతున్నా.

–దార్ల కోటేశ్వరమ్మ, వృద్ధురాలు, అబ్బూరు

వణికిస్తున్న వింత జ్వరాలు



ఏరియా వైద్యశాలలో ఓపీ వద్ద కిటకిటలాడుతున్న రోగులు

ప్రస్తుతం వైరల్ ఫీవర్స్ తగ్గాక నొప్పులు, వాపులు, ఇతర ఆరోగ్య సమస్యలతో ప్రజలు విలవిల్లాడుతున్నారు. ఫీవర్ వచ్చినవారు, రానివారిలో కూడా కీళ్ల నొప్పులు, ఒంటి నొప్పులు, కళ్లు, ముఖం ఉబ్బిపోవడం, చర్మంపై దద్దుర్లు, రంగు మారి పోవడం, మచ్చలు పడటం తదితర సమస్యలతో సతమతమవుతున్నారు.

- కేసులు ఎక్కువగా ఉన్న చోట తంతు నడిపిస్తుండగా పూర్తిస్థాయిలో నియంత్రణ చర్యలు చేపట్టడం లేదన్న విమర్శలు వినిపిస్తున్నాయి. పట్టణం, గ్రామాల్లో జ్వరాల తీవ్రత, దోమల నిర్మూలనకు ఫాగింగ్ చేయడం డ్రైన్లు శుభ్రం చేయడం, చెత్తకుప్పలు తొలగించి బ్లీచింగ్ చల్లించడం, తాగునీటి క్లోరినేషన్, ప్రత్యేక పారిశుద్ధ్య నిర్వహణ, ఇతర నియంత్రణ చర్యలు, ఆసుపత్రుల్లో మందులు, రక్త పరీక్షలకు కిట్లు లభ్యత, జ్వరాల బారిన పడకుండా ప్రజలకు అవగాహన కార్యక్రమాలపై చర్యలు తీసుకుంటున్న దాఖలాలు అంతంత మాత్రమే. ప్రజలను పట్టి పీడిస్తున్న విష జ్వరాల నియంత్రణకు పూర్తి స్థాయిలో డివిజన్ యంత్రాంగం చర్యలు చేపట్టాలని ప్రజలు కోరుతున్నారు.

దూర విద్యా విధానంపై అవగాహన



పెదకూరపాడు: గ్రామీణ ప్రాంత యువకులు దూర విద్యా విధానంపై అవగాహన కలిగి ఉండాలని మండల విద్యాశాఖాధికారి సత్యనారయణ అన్నారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో దూర విద్యా విధానంపై ఒక రోజు అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా సత్యనారయణ మాట్లాడుతూ సరళమైన సార్వత్రిక విద్యా విధానం, మహిళలకు, పలు వృత్తి, వ్యాపార రంగాల్లో ఉన్న వారికి, ఉద్యోగులకు, ప్రజాప్రతినిధులకు సదవకాశమన్నారు. సెలవు దినాల్లో మాత్రమే తరగతులు నిర్వహిస్తారని తెలిపారు. ఎంపీడీవో ఆఫీసు ఏవో శ్రీనివాసరావు, ప్రధానోపాధ్యాయులు రమణ, శ్రీనివాసరెడ్డిలు పాల్గొన్నారు.

చైన్ అపహరించిన నిందితులను పట్టుకుంటాం

సీఐ పత్తిపాటి సురేష్



పెదకూరపాడు: వృద్ధురాలిని బంధించి చైన్ అపహరణకు పాల్పడిన నిందితులను పట్టుకునేందుకు తీవ్ర ప్రయత్నాలు చేస్తున్నామని పెదకూరపాడు సీఐ పత్తిపాటి సురేష్ తెలిపారు. బుధవారం పెదకూరపాడులోని బాధితురాలు చుండు సీతమహాలక్ష్మి గృహాన్ని సందర్శించి బాధితురాలు వద్ద నుంచి వివరాలు సేకరించారు. అనంతరం సీసీ ఫుటేజ్‌ను పరిశీలించారు. దొంగతనాలకు పాల్పడిన వారికి కఠిన శిక్షలు తప్పవని హెచ్చరించారు. ఘటనా స్థలి వద్ద పరిసరాలను పరిశీలించారు. వారి వెంట ఎస్ఐ బాలూనాయక్, సిబ్బంది ఉన్నారు.

పార్టీలకు అతీతంగా గ్రామాల అభివృద్ధికి పాటుపడాలి

ఎంపీపీ రాజేశ్వరి



సర్వసభ్య సమావేశంలో మాట్లాడుతున్న జెడ్పీటీసీ సభ్యురాలు

రాజుపాలెం: పార్టీలకు అతీతంగా గ్రామాల అభివృద్ధికి ప్రజా ప్రతినిధులు పాటుపడాలని ఎంపీపీ తేలుకుట్ల రాజేశ్వరి తెలిపారు. మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీపీ అధ్యక్షతన సర్వసభ్య సమావేశం బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీపీ మాట్లాడుతూ అధికారులు ప్రజా ప్రతినిధులతో కలసి గ్రామాల్లో అభివృద్ధి పనులు చేపట్టాలని సూచించారు. తాగునీటి సమస్య ఉంటే వెంటనే తెలియపరచాలని చెప్పారు. జెడ్పీటీసీ దొంతిరెడ్డి సునీత మాట్లాడుతూ వాతావరణ పరిస్థితుల వలన గ్రామాలలో జ్వరాలు ఎక్కువగా ఉన్నందున ఆరోగ్య సిబ్బంది చురుకుగా పనిచేయాలని తెలిపారు. ముందుగా మండల స్థాయి అధికారులు వారి శాఖల్లో జరుగుతున్న అభివృద్ధి పనులు, పనితీరు గురించి వివరించారు. కార్యక్రమంలో ఎంపీడీవో రామకృష్ణప్రసాద్, తహసీల్దారు దినేష్ రావు, ఎంఈవో–1 మల్లిఖార్జునశర్మ, ఏవో వెంకట నర్సయ్య తదితరులు పాల్గొన్నారు.

జీవన నైపుణ్యాలపై అవగాహన సదస్సు



మాట్లాడుతున్న సిస్టర్ విన్నరసి

దొడ్లేరు(క్రోసూరు): అమరావతి గుడ్ షెపర్డ్ స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో మండలంలోని దొడ్లేరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో జీవన నైపుణ్యాలపై బుధవారం అవగాహన సదస్సు జరిగింది. సదస్సుకు సంస్థ కార్యకర్త లక్ష్మణ్ అధ్యక్షత వహించగా, ముఖ్యఅతిథిగా బచ్‌పన్ బచావో స్టేట్ కోఆర్డినేటర్ తిరుపతిరావు పాల్గొని మాట్లాడారు. విద్యార్థులకు జీవన నైపుణ్యాలు తప్పకుండా అవసరం అన్నారు. మంచి కమ్యూనికేషన్ స్కిల్స్ ఉంటే భవిష్యత్తు బావుంటుందని చెప్పారు. ప్రతి ఒక్కరూ తమ బలాలు బలహీనతలు తెలుసుకొని ముందుకు సాగాలన్నారు. గుడ్ షెపర్డ్ సంస్థ డైరెక్టర్ సిస్టర్ విన్నరసి మాట్లాడుతూ ప్రతి ఒక్కరు నిర్ణయం తీసుకునే అధికారం కలిగి ఉండాలన్నారు. జీవితంలో ఒక లక్ష్యాన్ని కలిగి ఉండాలని, కౌమార దశలో విద్యార్థులు అట్రాక్షన్‌కు గురై జీవితాలను పాడు చేసుకుంటున్నారని అన్నారు. కార్యక్రమంలో సంస్థ సిబ్బంది బాబు పవన్ కుమార్, విద్యార్థినులు పాల్గొన్నారు.

అంటువ్యాధుల బారిన పడకుండా ఉండాలి



ప్రభుత్వ జూనియర్ కళాశాలలో అంటువ్యాధులపై అవగాహన కార్యక్రమం

దాచేపల్లి : అంటువ్యాధుల బారిన పడకుండా ఉండాలని చెల్డ్ ఫండ్ ఇండియా జోనల్ సూపర్‌వైజర్ ఎం. విశ్వేశ్వరరావు అన్నారు. హెచ్ఐవీ, లైంగికంగా సంక్రమించే అంటువ్యాధులపై నారాయణపురం ప్రభుత్వ జూనియర్ కళాశాలలో బుధవారం అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. చెల్డ్ ఫండ్ ఇండియా లింక్ వర్కర్స్ స్కీమ్ ఉమ్మడి గుంటూరు జిల్లాలో 100 గ్రామాల్లో పని చేస్తుందని, ఇంటెన్సిఫైడ్ ఐఈసీ క్యాంపెయిన్‌ల ద్వారా పల్నాడు జిల్లా వ్యాప్తంగా 55 గ్రామాల్లో 8 వారాల పాటు హెచ్ఐవీ, టీబీ, సుఖవ్యాధులపై అవగాహన కల్పిస్తున్నామని ఆయన చెప్పారు. ఐఈసీ మెటీరియల్స్, కండోమ్స్ ఉచితంగా అందజేస్తున్నామని, హెచ్ఐవీ, సుఖవ్యాధుల నివారణకు తమ వంతు ప్రచార కార్యక్రమాలు విస్తృతంగా నిర్వహిస్తున్నట్లు వెల్లడించారు. హెచ్ఐవీ బాధితుల పట్ల వివక్ష చూపించవద్దని, వారిని ఆదరించి అభిమానించాలని ఆయన సూచించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ టి.జె.చంద్రశేఖర్, అధ్యాపకులు వెంకటేశ్వర్లు, లింక్ వర్కర్స్ లీలావతి, సాగర్, అనిల్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

గాలికుంటు వ్యాధి టీకాలతో ఎన్నో ప్రయోజనాలు



పశు పోషకులకు గాలికుంటు వ్యాధి టీకాల ప్రయోజనాలను వివరిస్తున్న పశు వైద్యాధికారి

రెంటచింతల: గాలికుంటు వ్యాధి నివారణ టీకాలను పశువులకు వేయించడం వలన పశు పోషకులు ఎన్నో ప్రయోజనాలు పొందవచ్చని మండల పశు వైద్యాధికారి షేక్ బషీర్ అన్నారు. బుధవారం మండలంలోని మిట్టగుడిపాడు గ్రామంలో చేపట్టిన జాతీయ గాలికుంటు వ్యాధి నివారణ టీకాల కార్యక్రమంలో పశువులకు టీకాలు వేసి ఆయన మాట్లాడారు. గ్రామంలో నాలుగు నెలలకు పైబడిన 22 ఆవులకు, 68 గేదెలకు ఉచితంగా గాలికుంటు వ్యాధి నివారణ టీకాలు వేయడం జరిగిందన్నారు. ఈ గాలికుంటు వ్యాధి వలన పశువులలో పాల దిగుబడి గణనీయంగా తగ్గి, పునరుత్పత్తి సామర్థ్యం దెబ్బతినే ప్రమాదం ఉందని హెచ్చరించారు. ఎద్దులలో పనిచేసే సామర్థ్యం తగ్గుతుందని దీంతో రైతులు ఎంతో నష్టపోతారన్నారు. వర్షాకాల సీజన్‌లో పశువులకు జ్వరం, మేత తినకపోవడం, వనుకు రావడం, పాలు తగ్గిపోవడం, పళ్లు కొరకడం, పెదవుల వాపు, చొంగకారడం, నోటిలో పుళ్లు ఏర్పడిన వెంటనే పాడి రైతులు పశు వైద్యాధికారిని సంప్రదించి గాలికుంటు వ్యాధి నివారణ టీకాలను వేయించాలని సూచించారు. మండలంలోని గ్రామాలకు చెందిన పాడి రైతులు తప్పనిసరిగా పశువులకు ఈ టీకాలను వేయించుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో పశు వైద్య సహాయకులు తేలుకుట్ల బాబు, రమేష్‌నాయక్, భాస్కర్ నాయక్, సర్పంచ్ గొట్టం ప్రమీలాగురవారెడ్డి పాడి రైతులు పాల్గొన్నారు.

రేపటి నుంచి త్రిశక్తి దుర్గా పీఠం వార్షిక బ్రహ్మోత్సవాలు

సత్తెనపల్లి: పట్టణంలోని భవిష్య పాఠశాల దగ్గర గల త్రిశక్తి దుర్గా పీఠం 18వ వార్షిక బ్రహ్మోత్సవాలు ఈ నెల 23 నుంచి 25 వరకు జరగనున్నాయని పీఠాధిపతులు వెలిదండ్ల హనుమత్‌స్వామీజీ, వి.వెంకట సుబ్బలక్ష్మి మాతాజీ బుధవారం తెలిపారు. ఈ నెల 23న విఘ్నేశ్వర పూజ, పుణ్యాహవాచనం, దీక్షధారణ, కలశ స్థాపన, అఖండ దీపారాధన, లక్ష్మీగణపతి, ప్రసన్నాంజనేయ, మహాలక్ష్మీ సమేత దుర్గామాతకు దశవిధ అభిషేకాలు, 108 కలశాలతో అభిషేకాలు, అమ్మవార్లకు పసుపు, కుంకుమ సమర్పణ జరుగుతాయన్నారు. అలాగే లలిత సహస్ర నామ పారాయణం, అమ్మవార్లకు అర్చన, హారతి, మంత్రపుష్పం, ప్రసాద వితరణ, సామూహిక కర్పూర హారతి జరుగుతాయన్నారు. 24న విఘ్నేశ్వర పూజ, ప్రసన్నాంజనేయస్వామికి లక్ష నాగవల్లి దళాలతో విశేష పూజలు, అమ్మవార్లకు పుష్పాభిషేకం, సామూహిక కుంకుమార్చన, అమ్మవారి ఊరేగింపు కార్యక్రమం జరుగుతుందన్నారు. 25న చండీ హోమం, పూర్ణాహుతి, మంత్రపుష్పం, హారతి, సత్తెనపల్లి నారాయణ సేవ నగర సంకీర్తన బృందంచే అమ్మవారి కీర్తనలతో అమ్మవార్ల ప్రభ బయలుదేరుతుందన్నారు. భక్తులకు అన్నసంతర్పణ కార్యక్రమం జరుగుతుందన్నారు. రాత్రి 8 గంటలకు పవళింపు సేవతో కార్యక్రమాలు ముగుస్తాయన్నారు. బ్రహ్మోత్సవాలు అర్చకుడు కలవకొలను సీతా రామశాస్త్రి (రాము) ఆధ్వర్యంలో జరుగుతాయన్నారు. భక్తులు హాజరై అమ్మవారి కృపకు పాత్రులు కావాలని కోరారు.

ఉత్తమ పురస్కారం అందుకున్న ఎంపీడీవోకు సత్కారం

మాచర్ల రూరల్: ఈ నెల 15న స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా ఉత్తమ సేవలందించినందుకు పురస్కారం అందుకున్న ఎంపీడీవో కాసెట్టి సరోజనీదేవిని బుధవారం వాసవి క్లబ్ మాచర్ల చెన్నకేశవ అధ్యక్షుడు ఓరుగంటి చెన్నకేశవరావు ఆధ్వర్యంలో ఆమె కార్యాలయంలో సత్కరించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ ప్రభుత్వం నిర్దేశించిన విధంగా ఎప్పటికప్పుడు సిబ్బందితో కలిసి సక్రమంగా ప్రజలకు సేవలు అందించటం ఎంతో ఆనందంగా ఉందన్నారు. మార్కాపురం నుంచి మాచర్లకు వచ్చి విధులు సక్రమంగా నిర్వహిస్తున్నానంటే అందుకు ప్రజాప్రతినిధులు, నాయకులు, ప్రజల సహకారం ఎంతో ఉందన్నారు. పలువురు ఆర్యవైశ్యులు తనను సత్కరించి అభినందించటం మరింత ఆనందంగా ఉందన్నారు. ఈ కార్యక్రమంలో వాసవి క్లబ్ మాచర్ల వ్యవస్థాపక అధ్యక్షుడు తిరివీధి వెంకట నాగేశ్వరరావు, సెక్రటరీ పందిరి నరసింహారావు, కోశాధికారి చుండూరు సత్యనారాయణ, వాసవి వృద్ధాశ్రమ అధ్యక్షులు పోలిశెట్టి పిచ్చయ్య, గంగిశెట్టి రాధాకృష్ణ, పలువురు అధికారులు, సభ్యులు పాల్గొన్నారు.

పీర్ ఎడ్యూకేటర్స్ ఎన్నిక



రొంపిచర్ల: మండలంలోని గోగులపాడు గ్రామంలో గల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో బుధవారం ఆరోగ్య సబ్ సెంటర్ ఆధ్వర్యంలో పీర్ ఎడ్యూకేటర్స్ ఎన్నిక కార్యక్రమం నిర్వహించారు. ఎన్నికైన విద్యార్థులకు పీర్ ఎడ్యూకేటర్స్ కోట్లు, టోపీలు పంపిణీ చేశారు. అలాగే విద్యార్థినీ విద్యార్థులకు ఫ్లోరోసిస్, స్క్రీనింగ్, టెస్టులు నిర్వహించారు. పాఠశాలలోని బాల బాలికలకు టీడీ టీకాలు వేశారు. పిల్లల్లో రక్తహీనత నివారణపై అవగాహన కల్పించారు. పోషక పదార్థాలు ఉన్న ఆకుకూరలను ఎక్కువగా తినాలన్నారు. మంచి స్పర్శ, చెడు స్పర్శలపై వివరించారు. మధ్యాహ్న భోజనం ప్రాముఖ్యతను విపులీకరించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయుడు హనుమంతరావు, ఎంఎల్‌హెచ్‌పీ ఝాన్సీరాణి, ఏఎన్ఎం రాజ్యలక్ష్మి, ఆశ కార్యకర్తలు, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

విద్యతో ఉన్నత శిఖరాలు చేరుకోవచ్చు

ఎమ్మెల్యే కన్నా లక్ష్మీనారాయణ



పట్టాలు అందుకున్న విద్యార్థులతో ఎమ్మెల్యే కన్నా లక్ష్మీనారాయణ

సత్తెనపల్లి: విద్య వలన ఉన్నత శిఖరాలకు చేరుకోవచ్చని సత్తెనపల్లి శాసనసభ్యుడు కన్నా లక్ష్మీనారాయణ అన్నారు. పట్టణ గుంటూరు రోడ్‌లోని వేద జూనియర్ కళాశాలలో బుధవారం జరిగిన గ్రాడ్యుయేషన్ డే లో ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. సభకు కళాశాల డైరెక్టర్ చింతాడ రమేష్ అధ్యక్షత వహించారు. ఎమ్మెల్యే కన్నా మాట్లాడుతూ విద్య వలన జీవితంలో ఉన్నతంగా స్థిరపడతారని, సమాజంలో మంచి గుర్తింపు వస్తుందన్నారు. ప్రభుత్వ హాస్టల్‌లో ఉంటున్న విద్యార్థులకు ఉద్యోగాలకు శిక్షణ ఇస్తూ పల్నాడు జిల్లాలో మంచి పేరు పొందిన వేద విద్యా సంస్థలను అభినందించారు. నర్సింగ్ వృత్తి ఎంతో పవిత్రమైందని అన్నారు. సత్తెనపల్లిలో నర్సింగ్ స్కూల్ ద్వారా ప్రభుత్వ ఉద్యోగాలు సాధించిన విద్యార్థులను అభినందించారు. తల్లితండ్రుల ఆశలకు అనుగుణంగా చదువుకోవాలని, పదవ తరగతి పూర్తి చేసి కాలేజీకి వచ్చిన విద్యార్థులకు శుభాకాంక్షలు తెలిపారు. కళాశాలలో పారామెడికల్, నర్సింగ్ పూర్తి చేసిన విద్యార్థులకు పట్టాలను అందజేశారు. నర్సింగ్ కోర్సు ట్రైనింగ్ పొందేందుకు వృత్తి ప్రమాణంను ఏరియా వైద్యశాల సూపరింటెండెంట్ బి.లక్ష్మణరావు, నర్సింగ్ సూపరింటెండెంట్ రాధతో కలసి చేయించారు. అనంతరం కళాశాల పాలకవర్గం ఎమ్మెల్యే కన్నా లక్ష్మీనారాయణను, అతిథులను సత్కరించారు. కార్యక్రమంలో న్యాయవాది పూజల వెంకట కోటయ్య, కళాశాల కరెస్పాండెంట్ ప్రభావతి, ప్రిన్సిపాల్స్ అరుణ, మాలతి, సైదా నాయక్, అనూష, అకడమిక్ డైరెక్టర్ చింతాడ సూర్య ప్రకాష్, ఆతుకూరి నాగేశ్వరావు, బీజేపీ నాయకులు శంకరరావు, హెడ్ సిస్టర్ వెంకటేశ్వరమ్మ, బాజీ తదితరులు పాల్గొన్నారు.

పశువులకు గర్భకోశ వ్యాధి నివారణ పరీక్షలు



వాల్‌పోస్టర్లు ఆవిష్కరిస్తున్న వైద్యాధికారులు

నాదెండ్ల: యడ్లపాడు మండలంలోని చెంఘీజ్‌ఖాన్ పేట గ్రామంలో గోకుల్ మిషన్ ఆధ్వర్యంలో ఉచిత పశు గర్భకోశ వ్యాధుల చికిత్స శిబిరం నిర్వహించారు. కార్యక్రమానికి నరసరావుపేట డీడీ డాక్టర్ రామారావు, ఏడీ డాక్టర్ నర్సింహులు, చిలకలూరిపేట ఏడీ శ్రీనివాసరావు, స్థానిక వైద్యాధికారులు డాక్టర్ రాధాకృష్ణ, రోజర్ బెన్ని, ఏడుకొండలు, దీప్తి, గ్రామ ఉప సర్పంచ్ ఆంజనేయులు పాల్గొన్నారు. గేదెలకు చూడి పరీక్షలు నిర్వహించి ఎదకు రాని యాభై పశువులు, 15 తిరగపార్లే పశువులను గుర్తించి ఉచితంగా మందులు, దూడలు, గేదెలకు నట్టల నివారణ మందులు వేశారు. గాలికుంటు వ్యాధి నివారణకు టీకాలు వేశారు. ఈ సందర్భంగా డాక్టర్ రామారావు మాట్లాడుతూ పశుపోషకులు గేదెలు ఈనిన తర్వాత 45 రోజుల నుంచి 90 రోజులలోపే గేదె ఎదకు వచ్చేలా యాజమాన్య పద్ధతులు పాటించాలని, ప్రతి ఏడాది ఒక దూడ పొందవచ్చని తెలిపారు. ఇలా చేయకుంటే పాడి రైతు నష్టపోయే అవకాశం ఉందన్నారు. గేదెల్లో ఎద లక్షణాలు గుర్తించటం, సరైన సమయంలో చూడికట్టించటం తప్పనిసరిగా చేయాలన్నారు. పశుబీమా పథకంలో గురించి అవగాహన కల్పించారు.

విద్యార్థులకు పురస్కారాలు ప్రదానం



పిడుగురాళ్లరూరల్: విద్యార్థులు విద్యలో బాగా రాణించాలని, తాము ఎంచుకున్న లక్ష్యం కోసం పని చేయాలని ఎన్ఆర్ఐ దొండేటి వెంకటేశ్వరరెడ్డి అన్నారు. మండలంలోని జూలకల్లు గ్రామ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ప్రతి తరగతిలో ప్రథమ, ద్వితీయ స్థాయిలో నిలిచిన విద్యార్థులకు పురస్కారాలను అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులు ప్రాథమిక స్థాయి నుంచే బాగా చదవాలని అప్పుడే ఉన్నత శిఖరాలను అధిరోహించవచ్చని అన్నారు. ఈ అవార్డులను వెంకటేశ్వరరెడ్డికి విద్యాబుద్ధులు నేర్పిన మంగిరెడ్డి, శ్రీరామమూర్తి పేర్ల మీద అందజేశారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు పట్టాభిరామయ్య, ఉపాధ్యాయులు, ఆంజనేయులురెడ్డి తదితరులు పాల్గొన్నారు.